
ప్రజాశక్తి
గురువారం 4 జులై 2024
5
నంద్యాల





శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న డిపిఒ మంజులవాణి


డీఎస్సీ కోసం సన్నాహాలు

- ఉమ్మడి జిల్లాలో 2645 పోస్టుల భర్తీ
- పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఐదేళ్లుగా డిఎస్సీ నిర్వహించకపోవడంతో బిఎడ్, డిఎడ్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ప్రభుత్వం విడుదల చేయనున్న డిఎస్సీపై ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా లక్ష మంది వరకూ డిఎస్సీకి అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,645 పోస్టుల భర్తీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు..

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు తీసుకున్న సమయంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం తొలి సంతకం చేశారు. దీంతో ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఐదేళ్లుగా డీఎస్సీ నిర్వహించకపోవడంతో బిఎడ్, డిఎడ్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ప్రభుత్వం విడుదల చేయనున్న డీఎస్సీపై ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా లక్ష మంది వరకూ డిఎస్సీకి అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ ఏడాది ఆరంభంలో వదిలిన డిఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు 1,543 పోస్టులు కేటాయించారు. టిడిపి ప్రభుత్వం విడుదల చేయనున్న మెగా డిఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రామాణికంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు



సమాచారం. ఈ డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలోని 2,645 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు అధికారులు సన్నాహకాలు పూర్తి చేస్తున్నారు. ఎస్‌జిటి 1791, ఎస్ఎ తెలుగు 84 పోస్టులను, ఎస్ఎ హిందీ 113 పోస్టులను, ఎస్ఎ ఇంగ్లీష్ 61, ఎస్ఎ గణితం 89, ఎస్ఎ భౌతిక శాస్త్రం 63, ఎస్ఎ జీవ శాస్త్రం 61, ఎస్ఎ సాంఘిక శాస్త్రం 78, పిఇటి 211 పోస్టులను భర్తీ చేయనున్నారు.

వైసిపి ప్రభుత్వం ఇచ్చిన డిఎస్సీకి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్‌జిటి పోస్టులకు 19వేల మంది, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదివేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో డిఎడ్, బిఎడ్ అయిపోయి ఉపాధ్యాయ పోస్టులకు అర్హులుగా అభ్యర్థులు ఉండే లక్ష మంది ఉన్నారు. కానీ పోస్టులు, పరీక్షపై ఉన్న గందరగోళం, డిఎస్సీ జరుగుతాదో లేదో అనే అనుమానంతో తక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 39 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, టిడిపి ప్రభుత్వం చేపట్టే డిఎస్సీ ద్వారా కనీసం 25వేల పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగులు, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

అన్ని ఖాళీలనూ భర్తీ చేయాలి



డిఎస్‌సికి సంబంధించిన పోస్టులు రాష్ట్రంలో 39వేల ఖాళీలు ఉన్నాయి. కేంద్ర మంతి గతంలో ప్రకటించారు. డిఎస్‌సి కింద మొత్తం 39 వేల ఖాళీలనూ భర్తీ చేయాలి. టెట్ కం టిఆర్‌టి పెడతారా లేక టెట్ వేరుగా నిర్వహించి తరువాత డిఎస్‌సి నిర్వహిస్తారా అనేది స్పష్టత లేదు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. పాఠశాలల రేషనలైజేషన్ కోసం తీసుకొచ్చిన జిఒ 117ను రద్దు చేయాలి. కానిస్టేబుల్ నియామకం నోటిఫికేషన్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. దాన్ని పరిష్కరించాలి. రాష్ట్రంలో అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న 2.36 లక్షల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఆ పోస్టులను భర్తీ చేసే వరకూ జులై నుంచే నిరుద్యోగ భృతి అమలు చేయాలి. ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 ఏళ్లకు తగ్గించాలి.

- శివ, డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి.

శానిటేషన్‌పై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి

ప్రజాశక్తి - బనగానపల్లె

శానిటేషన్‌పై గ్రామపంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి హెచ్చరించారు బుధవారం పట్టణంలోని పంచమపేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజులపాటు పట్టణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు పట్టణంలో 50 శాతం కాలువలను గ్రామ పంచాయతీ సిబ్బంది శుభ్రం చేసినట్లు చెప్పారు. జిల్లాలో డయేరియాపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డయేరియా వ్యాపించకుండా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శానిటేషన్ పనులను చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో డస్టుబిన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వ్యాపారులు, ప్రజలు చెత్తాచెదారాన్ని కాలువల్లో, రోడ్లపై వేయకుండా డస్ట్ బిన్‌లలో వేసుకుని గ్రామపంచాయతీ వాహనాలు వచ్చినప్పుడు అందులో వేయాలని సూచించారు. ప్రధాన కూడల్లో ప్రజలు, వ్యాపారులు చెత్తను రోడ్లపై వేస్తున్నారని, వ్యాపారులకు త్వరలో నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి వ్యాపారి సంస్థ వద్దను డస్టు బిన్‌ను ఏర్పాటు చేసుకోవాలని, చెత్తాచెదారాన్ని రోడ్లపై వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, ఈఓఆర్డి గ్రామపంచాయతీ ఈవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నూతన కలెక్టర్ రాజకుమారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను జిల్లాకు రాబోయో నూతన కలెక్టర్ బి.రాజకుమారి మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో నూతన కలెక్టర్ మంత్రికి పుష్పగుచ్చాలు అందజేసి పరిచయం చేసుకున్నారు.

5న నూతన కలెక్టర్ బాధ్యతలు స్వీకరణ

ఈనెల 5న నంద్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా బి.రాజకుమారి బాధ్యతలు స్వీకరించనున్నట్లు రెవెన్యూ అధికార వర్గాలు వెల్లడించాయి.



మంత్రి ఫరూక్‌కు బొకే అందజేస్తున్న నూతన కలెక్టర్



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు శివ

విద్యాసంస్థల బంద్‌కు డివైఎఫ్ఐ మద్దతు

ప్రజాశక్తి - నంద్యాల

నేడు విద్యార్థి సంఘాలు చేపట్టిన దేశ వ్యాప్త విద్యాసంస్థల బందుకు డివైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందనినంద్యాల పట్టణ కార్యదర్శి ఎస్.శివ తెలిపారు. బుధవారం స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హయాంలో ఇప్పటికే 65 సార్లు పేపర్లు లీకులు అయ్యాయన్నారు. ఇది లీకుల ప్రభుత్వమని విమర్శించారు. కేంద్రంలో నీట్ పరీక్ష ఫలితాలలో జరిగిన అవగతవగలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్‌లో పాల్గొంటామని,జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. సమావేశంలో పట్టణ ఉపాధ్యక్షులు సాయి, నడిగడ్డ మా భాష, బొగ్గు లేని సాయి, సహాయ కార్యదర్శి బన్నీ, ప్రసాద్ లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యల స్వాగతం

- మహానంది మండలంలో దెబ్బతిన్న రహదారులు
- గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం - లోతట్టు బ్రిడ్జిలతో రాకపోకలకు అంతరాయం
- ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడలు కరువు - శుభ్రతకు నోచని తాగునీటి ట్యాంకులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలానికి నేడు వస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు కొండంత ఆశలు పెట్టుకున్నారు. మహానంది మండలంలో గత కొన్ని సంవత్సరాల నుండి పనులు ఆగి పోయి అభివృద్ధి ఆమడ దూరంలో నిలిచిపోయింది.

మహానంది మండలంలో ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని మోడల్ స్కూల్, జడ్పీహెచ్ హై స్కూల్‌లకు ప్రహరీ గోడలు లేక రాత్రి సమయాల్లో అల్లరి మూకలకు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.



గాజులపల్లి వద్ద నంద్యాల గిద్దలూరు వెళ్ళు రహదారి పరిస్థితి

మండలంలో దెబ్బతిన్న రహదారులు

ఎంసీ ఫారం గ్రామం నుండి మహానంది క్షేత్రానికి మూడు కిలోమీటర్ల మేర రహదారి అడుగుకో గుంతతో, వర్షం పడితే చాలు చెరువులు, నీటి కుంటలను తలపిస్తున్నాయి. వాహనదారులు నరకయాతన పడుతున్నారు. అలాగే గాజులపల్లి-గిద్దలూరు జాతీయ రహదారి గాజులపల్లి గ్రామం వద్ద, తిమ్మాపురం నుండి జమాలయ దర్గా రహదారి కూడా గుంతలతో అధ్వానంగా ఉంది. నందిపల్లి నుండి సూర్యనంది ఆర్చి వరకు, అబ్బీపురం గ్రామంలో శివాలయం నుండి దుర్గగుడి వద్దకు రోడ్డు దారి దయనీయంగా ఉంది.

లోతట్టు బ్రిడ్జిలతో స్తంభిస్తున్న రాకపోకలు

మండలంలో వాగులు, వంకల వద్ద బ్రిడ్జిలు లోతట్టుగా ఉండడంతో వర్షాల తీవ్రత ఎక్కువైతే పొంగిపొర్లి బ్రిడ్జిలపై నీరు చేరి ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుత బ్రిడ్జిలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది.

గ్రామాల్లో లోపించిన పరిశుభ్రత

గ్రామాలలో సైడు కాలువలు సరిగా లేక మురికి నీరు పోయే దారి లేక ఎక్కడ పడితే అక్కడ మురుగునీరు దర్శనమిస్తోంది. మురుగునీటిలో దోమలు వృద్ధి చెందుతూ ప్రజలపై దాడి చేస్తుండడంతో టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామాలలో తాగునీటి ట్యాంకులు శుభ్రతకు నోచుకోవడం లేదు. అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. నీటి ట్యాంకులు శుభ్రత లేకపోవడం వలన నీరు కలుషితమై అనేక రోగాలకు కూడా దారితీస్తుంది.

రైతుల మధ్య తెలుగు గంగ 11వ బ్లాక్ గొడవ

మండలంలో తెలుగు గంగ 11వ బ్లాక్ గురించి గతంలో తమ్మడపల్లె, బొల్లవరం గ్రామాల రైతులు ఘర్షణలకు దిగిన పరిస్థితులు ఉన్నాయి. ఈ సమస్యను ప్రస్తుత ఎమ్మెల్యే పార్టీలకతీతంగా శాంతియుతంగా పరిష్కరించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామాలలో ఆలయ భూములు, మసీదు మాన్యాలు అన్యాక్రాంతం అయ్యాయి. వాటిని భూకబ్జాదారుల నుండి కాపాడాలి. మండలంలో రైతులు అధికంగా సాగు చేసే పసుపు పంట నిల్వ ఉంచుకునేందుకు గోడౌన్ ఏర్పాటు చేయాలి. అరటి పంటకు మద్దతు ధర ఏర్పాటు చేసి దళారుల వ్యవస్థ లేకుండా చేయాలి. వరి పంట నిల్వకు గ్రామానికి ఒక గోడౌన్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో మండలంలోని చెరువుల్లో ఇష్టానుసారంగా ఎర్రమట్టి తవ్వి అక్రమ రవాణా చేసి లక్షల్లో గడించారు. ఇకనుండి ఎర్రమట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అకాల వర్షాలతో నష్టపోయి అరటి రైతులు

ఏప్రిల్ మాసంలో అకాల గాలులకు మండలంలో అరటిపంట నేలమట్టం కావడంతో రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. బాధిత రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మహానంది మండలంలో గత ప్రభుత్వం హయాంలో నెలకొన్న సమస్యలను ప్రజల ఆదరాభిమానాలతో, అభిమానంతో, నమ్మకంతో గెలిచిన ప్రస్తుత ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.



గాజులపల్లి గ్రామంలో డ్రైనేజ్ పరిస్థితి



బసాపురం గ్రామంలో నీటి ట్యాంకుల దుస్థితి



అవగాహన కల్పిస్తున్న నవభారత్ ఫర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్

సేంద్రీయ, జీవ ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

పంటల సాగులో రసాయన ఎరువులకు బదులు సేంద్రీయ, జీవ ఎరువులు వాడాలని నవభారత్ ఫర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ కె.సుదర్శనాచారి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల మండంలోని కానాల, చాబోలు గ్రామాలలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రీయ, జీవ ఎరువులు వాడడం వల్ల పెట్టుబడులను తగ్గించవచ్చన్నారు. అధిక దిగుబడులను పొందవచ్చని వివరించారు. ఆసక్తి గల వారికి సేల్స్ విభాగంలో శిక్షణ ఇచి ఉద్యోగఅవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎండిఈ సురేష్, డివైఎస్ఎం, రైతులు పాల్గొనారు.

వైభవంగా ఆరాధన మహోత్సవం

- పాల్గొన్న మంత్రి బిసి సతీమణి బిసి ఇందిరా రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని గొల్లపేటలో పూదోట లింగ అవధూత స్వామి ఆరాధన మహోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ మహోత్సవాలలో రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బిసి ఇందిరా రెడ్డికి తీర్థ ప్రసాదాలు ఆలయ అర్చకులు అందచేసారు. పూదోట లింగ అవధూత స్వామి మఠం అనువంశిక ప్రధాన అర్చకులు శివ ప్రసాద్ ఆచారి, శరత్ కుమార్ ల ఆధ్వర్యంలో ఆరాధన మహొూత్సవాలు వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



ఆరాధన మహోత్సవాల్లో పాల్గొన్న బిసి ఇందిరా

నీట్ ఫలితాల్లో 'ఎస్‌డిఆర్ ఆకాంక్ష' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నీట్-2024 ఫలితాల్లో ఎస్‌డిఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని కళాశాల చైర్మన్ యస్. కొండా రెడ్డి తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యర్థినీ, విద్యార్థులను బుధవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పి.అక్షిత రెడ్డి 691, పి.లీల మమతా 676, జి.వైష్ణవి 645, ఎం.మధులిక 641, కె.సాయి కుమార్ రెడ్డి 629 మార్కులతో అద్భుతమైన ఫలితాలను సాధించిన్నట్లు చెప్పారు. మొత్తం 60 మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా అందులో 600 మార్కులకు పైగా 8 మంది, 550 పైగా 16 మంది, 500 పైగా 26 మంది మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. అద్భుత ఫలితాలు సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులను అభినందిచారు. ఇలాంటి అద్భుతమైన ఫలితాలను ప్రతి సంవత్సరం సాధించాలని మనస్ఫూర్తిగా కోరారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ తమకు ఈ ఫలితాలు రావడానికి గల కారణం బోధించిన అధ్యాపకులు, అధ్యాపకేతర బృందమన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ కొండారెడ్డి



కేక్ కట్ చేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

శ్రీదేవి హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణంలోని పాతూరు వీధిలో గత నెల 25న జరిగిన అట్ల శ్రీదేవి హత్య కేసులో బుధవారం ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డి.ఎస్.పి షేక్ షర్ఫుద్దీన్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కేసులో అట్ల వేణుగోపాల్ రెడ్డి, ఆయన భార్య శిరీష, దూదేకుల రాకేష్, దేవేంద్ర కుమార్, శేఖర్ సింగ్, మేకల నరేష్‌లను రామలక్ష్మీ కొట్టాల ఊరి బయట అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 6 సెల్ ఫోన్లు, రెండు బైకులు, హత్యకు ఉపయోగించిన ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ హత్యకు కేవలం ఆస్తి తగాదాలే కారణమని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదన్నారు. అట్లా శ్రీదేవి, ఆమె భర్త అట్ల విజయభాస్కర్ రెడ్డి ఈ హత్యకు పాల్పడిన ఆయన సోదరుడు వేణుగోపాల్ రెడ్డి కుటుంబానికి నడుమ గత 20 సంవత్సరాలుగా పొలం విషయంలో గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయంలో పలుమార్లు ఇరువర్గాలు కేసులు కూడా పెట్టుకున్నారని చెప్పారు. 1996లో ఏవి సుబ్బారెడ్డి కూడా ఈ విషయంలో పంచాయతీ చేశారన్నారు. హతురాలు శ్రీదేవి ఇటీవల రాజకీయాలలో చురుకుగా ఉండడంతో పొలాన్ని తమకు పంచి ఇవ్వదనే కోపంతో ఈ హత్యకు కుట్ర చేశారన్నారు. ఈనెల 25న అట్లా శ్రీదేవి భర్త విజయ భాస్కర్ రెడ్డికి నంద్యాలలో డయాలసిస్ చేయించి తిరిగి ఆళ్లగడ్డకు వచ్చినప్పుడు వారి కళ్ళల్లో కారం చల్లి దాడి జరిపి హత్య ప్రయత్నం చేయడంతో శ్రీదేవి తీవ్రంగా గాయపడి మృతి చెందారన్నారు. శ్రీదేవి భర్త హైదరాబాద్‌లోని ఒ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ కేసులో మొత్తం 11 మంది వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, హత్యలో స్వయంగా పాల్గొన్నది కేవలం 6 మంది మాత్రమేనని వివరించారు. సమావేశంలో సిఐ రమేష్ బాబు, పట్టణ ఎస్సై వెంకట రెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి

వ్యాధుల బారి నుండి ప్రజలను కాపాడాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణ ప్రజలు సీజన్, అంటురోగాల బారిన పడకుండా మున్సిపల్ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసు రత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, సీనియర్ నాయకులు ఎం.రజాక్‌లు కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్‌కి సిపిఎం పట్టణ కమిటీగా పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 24 వార్డులలో పారిశుధ్య లోపం వల్ల ప్రజలు అంటు రోగాల బారిన అతిసారా వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. కుళాయిలలో ఇప్పటికీ బురద, మురికి నీరు వస్తుందన్నారు. రోడ్లపైకి మురికి నీరు వస్తోందన్నారు. బోరింగులు రిపేరి చేయడానికని తీసి రెండేళ్లు అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అనేక వీధులలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ సగం వరకు వేసి అలాగే వదిలేశారన్నారు. చిన్నపాటి వర్షానికి పట్టణంలోని పలు వీధుల రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని అన్నారు. పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తారని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు డి రామ్ నాయక్, ఏ సురేంద్ర, నాయకులు వీరన్న, మహమ్మద్, గణపతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

నేడు మహానంది మండలంలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలంలో గురువారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పర్యటించనున్నారని టిడిపి నాయకులు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారని చెప్పారు. అనంతరం మండలంలో థ్యాంక్స్ ఫర్ ఓటింగ్ కార్యక్రమంలో భాగంగా తమ్మడపల్లె, అబ్బీపురం, గ్రామాల్లో పర్యటించి రచ్చబండ కార్యక్రమం, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. మండలంలోని కూటమి శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ


సిఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు

సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును బుధవారం విజయవాడ సిఎం క్యాంప్ కార్యాలయంలో నందికొట్కూరు, పాణ్యం ఎమ్మెల్యేలు గిత్త జయసూర్య, గౌరు చరిత రెడ్డి, టిడిపి నందికొట్కూరు ఇన్చార్జ్ గౌరు వెంకటరెడ్డి మర్యాదా పూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యేలు సిఎంతో చర్చించారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల లయన్స్ క్లబ్ 2024-25 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఎన్నికల కమిటీ సభ్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ రవికృష్ణ, ఆడిటర్ గోపాల్‌లు ప్రకటించారు. అధ్యక్షులుగా రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ నిజాముద్దీన్, కార్యదర్శిగా శిరిగిరి రమేష్, కోశాధికారిగా మామిళ్ల నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కూర ప్రసాద్, పోసిన సుబ్బారావు, సోమేశుల నాగరాజు, ఉపేంద్రనాథ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా అరవేటి రాఘవేంద్ర ,ఇమ్మడి వెంకట రామకృష్ణుడు, సీనియర్ సభ్యులను బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా, వివిధ కార్యక్రమాల కమిటీ చైర్మన్‌లుగా ఎన్నుకున్నారు.

టిడిపిలోకి మిట్టకందాల సర్పంచి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

పాములపాడు మండలం మిట్టకందాల గ్రామ సర్పంచ్ చింతల నారాయణ, ఉప సర్పంచ్ ఆంజనేయులు, కమ్మ కోటేశ్వర రెడ్డి, ఏడు మంది వార్డు మెంబర్లు బుధవారం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతల కుమార్ స్వామి, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, రంగస్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూములను కాపాడాలి : టిడిపి, జనసేన

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలంలోని దేవస్థానం భూములను అక్రమణదారుల నుండి కాపాడాలని కొలిమిగుండ్ల మాజీ సర్పంచ్ సీతారామయ్య, జనసేన మండల నాయకులు జి పెద్దయ్య అధికారులను కోరారు. కొలిమిగుండ్లలోని శ్రీ లలిత సుందరేశ్వర స్వామి దేవస్థానంలో వారు విలేకరులతో మాట్లాడారు. కొలిమిగుండ్ల మండలంలో గత తహశీల్దారుగా పనిచేసిన అధికారి వారికి అనుకూలమైన వారికి ఎటువంటి అనుభవం లేకున్నా అనుభవం ఉన్నట్లు ఆన్లైన్లో పేర్లు నమోదు చేసి పట్టాలు తీసుకున్నారని తెలిపారు. ఆ పట్టాలను రద్దుచేసి అర్హత కలిగిన వారికి భూములను పంపిణీ చేయాలన్నారు. మాజీ సైనికులకు, రిటైర్డ్ అయిన వారికి ఐదు ఎకరాలు భూములు ఇవ్వాలని ప్రభుత్వం జీవో జారీ చేసినా వారికి కేటాయించ లేదన్నారు. అక్రమంగా భూములు పొందిన వారిపై ఇప్పటికైనా అధికారుల స్పందించి విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హత కలిగిన వారికి ఆ భూములు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రామేశ్వర్ రెడ్డి, తలారి రమణ, మాజీ సైనికులు రామ్మూర్తి, కే చంద్రశేఖర్, రాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతోనే గతంలో నారా చంద్రబాబు నాయుడు పొదుపు సంఘాల ఏర్పాట్ల చేశారని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వెలుగు ఆఫీసులో మెప్మా పొదుపు మహిళల ఆర్‌పిఒబిల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు మహిళలతో ఆయన ముఖాముఖిగా మాట్లాడుతూ పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటిగా బంగ్లాదేశ్‌లో పొదుపు సంఘాల ఏర్పాటు జరిగిందని, అక్కడి మహిళలు ఆర్థిక అభివృద్ధిని సాధించడానికి చూసిన నారా చంద్రబాబు నాయుడు ఆంధ్ర రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ఐదు సంవత్సరాల్లో జగన్ ప్రభుత్వంలో దేవస్థానాలు చిన్నాభిన్నమయ్యాయని, ఇందులో పొదుపు మహిళల సంఘాలు కూడా ఉన్నాయన్నారు. ఈ వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి మహిళపై ఉందన్నారు. ఆత్మకూర్ మెప్మాలో అనేక ఆరోపణలు ఉన్నాయని, వీటన్నింటినీ సరిదిద్ది, అవినీతికి పాల్పడ్డ అధికారులను సైతం వదిలేది లేదని హెచ్చరించారు. బ్యాంకులు నేడు లక్షల రూపాయలు ఇస్తున్నాయంటే లక్షలాదిమంది మహిళా సంఘాలు ఉండడమే కారణమన్నారు. నమ్మకంతో తీసుకున్న రుణాలు చెల్లించినప్పుడే బ్యాంకులు కూడా రుణాలు ఇస్తాయని తెలవిపారు. సమావేశంలో కమిషనర్ హరిప్రసాద్, మెప్మా అధికారులు వెంకటేశ్వర్లు, హుస్సేన్ బి, శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ వంగాల శివరామరెడ్డి, గోవిందరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు జట్టి వేణుగోపాల్, కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

మినరల్ వాటర్ ప్లాంట్‌లో మరమ్మతులు పూర్తి

- ఉప సర్పంచి బండి మౌళేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌లో ట్యాంకు కొత్త పరికరాలతో మరమ్మతులు పూర్తి చేసినట్లు గ్రామ ఉపసర్పంచి బండి మౌళేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు 2 లక్షల రూపాయల విలువ చేసే కొత్త పరికరాలతో మరమ్మతులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ 2015లో ఎమ్మెల్యేగా ఉన్న బీసీ జనార్దన్ రెడ్డి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. 2019 వరకు గ్రామంలోని ప్రజలకు మినరల్ వాటర్ విడుదల చేసేవారని, 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక గ్రామంలోని కొందరు వైసిపి నాయకులు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను స్వాధీనం చేసుకొని 2019 నుండి 2024 వరకు తూతూ మంత్రంగా నీటిని విడుదల చేశారని విమర్శించారు. గ్రామ ప్రజలకు మినరల్ వాటర్ సరిగ్గా లేకపోవడంతో గ్రామంలోని ప్రజలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. బనగానపల్లె పట్టణానికి వెళ్లి మినరల్ వాటర్ తెచ్చుకునే వారని, 2024లో మళ్లీ ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్ రెడ్డి గెలుపొంది మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మరుక్షణమే గ్రామంలో నాణ్యమైన మినరల్ వాటర్ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారని, దీంతో రెండు లక్షల విలువచేసే పరికరాలు చెడిపోవడంతో వాటి స్థానంలో కొత్త పరికరాలు అమర్చి మరమ్మతులు చేపట్టామన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన మినరల్ వాటర్ అందిస్తున్నట్లు తెలిపారు. మినరల్ వాటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బండి మల్లేశ్వర రెడ్డి, నంద్యాల నాగేశ్వర రెడ్డి, సోమన్న గారి శంకర్ రెడ్డి, సోమన్న గారి మహేష్ రెడ్డి, దూదేకుల కాసిం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉప సర్పంచ్ బండి మౌళేశ్వర రెడ్డి

ఉపాధి పనులు ప్రారంభించాలి : వ్యకాసం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని 20 గ్రామపంచాయతీలలో వర్షాభావ పరిస్థితుల వల్ల కూలీలు పనులు లేక ఖాళీగా ఉన్నారని, వెంటనే ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి డేవిడ్, సిపిఎం సీనియర్ నాయకుడు రామచంద్రుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఉపాధి హామీ ఏపీవో వసుధకు, గిరిజన ఉపాధి హామీ ఎపిఓ నాగార్జున, ఎంపీడీవో ఆఫీస్ సూపరింటెండెంట్ హనీఫ్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీకి ప్రతిరోజు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని, పనిముట్లు, తాగునీరు, రవాణా ఖర్చులు చెల్లించాలన్నారు. పెండింగ్ బకాయిలను వెంటనే కూలీల ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ మేటీలు, కూలీలు శాంతయ్య, సుధాకర్, తిరుపాల్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ ఎపిఓ వసుధకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 18 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పి.నాగేశ్వరరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం డిమాండ్ చేశారు. బుధవారం చిగుర్మాన్ క్రాస్ రోడ్డు నందు ఫెడరేషన్ డోన్, ప్యాపిలి ఉమ్మడి మండలాల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఫీల్డ్‌లో పనిచేసే క్రమంలో ప్రమాదాలు జరిగితే ఎటువంటి బెనిఫిట్స్ లేవన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, అర్హత కలిగిన వారికి ప్రమోషన్స్ సౌకర్యం తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ పిఎన్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రమాదేవి, రామాంజులు, జిల్లా కోశాధికారి లత, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, గోవిందరాజులు, రామ మద్దయ్య, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కోయిలకొండ నాగరాజు, మధు పాల్గొన్నారు.

ప్యాపిలి మండల నూతన కమిటీ ఎన్నిక : ప్యాపిలి మండల కమిటీ గౌరవాధ్యక్షులుగా టి.శివరాం, అధ్యక్షులుగా వి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఎం.రామకృష్ణ, కె.చెన్నప్ప, ప్రధాన కార్యదర్శిగా కె.నీలకంటేశ్వర్, సహాయ కార్యదర్శులుగా ఎన్.ప్రభాకర్ నాయుడు, ఎల్.సౌజన్య, కోశాధికారిగా ఏ.వెంకటప్ప నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న నాయకులు



ఆలయంలో ఇఒ ఆకస్మిక తనిఖీలు

- ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు సస్పెండ్

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రంలోని లడ్డు కౌంటర్‌లో ఆలయం ఈవో నల్ల కాలువ శ్రీనివాసరెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. లడ్డు కౌంటర్లు స్టాక్ రిజిస్టర్ పరిశీలించగా ఆ రిజిస్టర్ కన్నా 304 లడ్లు తక్కువగా ఉండడంతో పాటు 419 రూపాయలు నగదు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులను, ముగ్గురు ఏజెన్సీ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఈవో ఆదేశాలు జారీ చేశారు. ఆలయంలో పనిచేసే ఉద్యోగస్తులు ఎవరైనా విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఇఒ హెచ్చరించారు. వీరి వెంట ఆలయ ఏఈవో మధు, ఓ. వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

బూత్ ఇన్‌చార్జిని పరామర్శించిన మాండ్ర

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : పట్టణంలోని 22వ వార్డు టిడిపి నాయకులు, 82వ బూత్ ఇంచార్జ్ కళాకర్‌ను నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి బుధవారం పరామర్శించారు. కళాకర్ ఆరోగ్యరీత్యా హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. మాండ్ర శివానందరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి కళాకర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవసరం ఉన్నా తనకు తెలియజేయాలని, అన్ని విధాలుగా తోడుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలి

ప్రజాశక్తి - బేతంచర్ల : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఆయా సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులు వారికి అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలు బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీ జడ్పీ హైస్కూల్‌ను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలకు సంబంధించిన రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికను, హాజరు శాతం పరిశీలించారు. నాడు-నేడు కింద జరుగుతున్న తరగతి అదనపు గదుల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. నాణ్యమైన పద్ధతిలో పాఠశాల గదుల నిర్మాణాలను నిర్మించాలన్నారు. ఉపాధ్యాయ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహానంది పరిసరాల్లో మళ్లీ చిరుత సంచారం

- పొలాల్లో చిరుత పాదముద్రలు

ప్రజాశక్తి - మహానంది

మహానంది పరిసరాల్లో బుధవారం మధ్యాహ్నం మళ్లీ చిరుత సంచరించింది. దీంతో గ్రామస్తులు, రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. రైతులు మాట్లాడుతూ మధ్యాహ్నం సమయంలో చిరుత నంది ఎదురుగా ఉన్న పొలాలలో సంచరించినట్లు తెలిపారు. ఈ విషయం మహానంది డిఆర్ఓ హైమావతికి తెలపగా వారు పులి సంచరించిన స్థలాన్ని పరిశీలించి పాదముద్రలు పులివేనని నిర్ధారించారన్నారు. చిరుత పులిని అటవీశాఖ అధికారులు త్వరితగతిన బంధించి అడవికి దూరంగా వదలాలని గ్రామస్తులు, భక్తులు ,రైతులు కోరుతున్నారు.


సింగవరం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రచ్చబండ

- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

ఓటేసిన ప్రతి ఒక్కరి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కారం చేయడం కోసమే రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శింగవరం, వెంగళ రెడ్డి పేట గ్రామాల్లో థాంక్స్ ఫర్ ఓటింగ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఓటేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసే సామర్థ్యం ఒక్క రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మాత్రమే ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువచ్చి పరిస్కరించుకోవాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందిపాటి నరసింహ రెడ్డి, బొల్లవరం మల్లేశ్వర రెడ్డి, రామ సుబ్బయ్య, వెంకటాపురం శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసంపూర్తిగా మినీ వంతెన నిర్మాణం

- ఇబ్బందుల్లో విద్యార్థులు

- పాఠశాల ముందు నిలిచిన మురికి నీరు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని డి కొట్టాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో నిర్మిస్తున్న మినీ వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు బడికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు అదనపు గదులను, అంగనవాడి నూతన భవనాన్ని నిర్మించి, పాఠశాల చుట్టూ ప్రహరీ గోడను, పాఠశాలకు ప్రత్యేకంగా వెళ్లేందుకు నూతనంగా మినీ వంతెనను ఏర్పాటు చేయాలనేది లక్ష్యం. ఇందుకు విరుద్ధంగా అధికారుల నిర్లక్ష్యంతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కేవలం బేస్మెంట్‌కే పరిమితం కాక పాఠశాలకు ప్రత్యేకంగా వెళ్లేందుకు మినీ వంతెన నిర్మాణానికి కేవలం పైపులను వేసి మధ్యలోనే నిర్మాణ పనులను వదిలేశారు. దీంతో పాఠశాల ఆవరణంలో మురికినీరు చేరడంతో విద్యార్థులు బడికి వెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిలిచిపోయిన మినీ వంతెన నిర్మాణ పనులను పూర్తిచేసి పాఠశాల ఆవరణంలో నిలిచిపోయిన మురికినీటిని తొలగించాలని, విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.


అసంపూర్తిగా మినీ వంతెన నిర్మాణం పనులు


పాఠశాల ఆవరణలో నిలిచిన మురికి నీరు

ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి - పాణ్యం : ప్రతి ప్రభుత్వ ఉద్యోగి చివరకు విధుల నుండి విరమణ తప్పదని మండల విద్యాధికారి కోటయ్య అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన పాణ్యం, తమ్మరాజు పల్లె పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, యాగంటయ్యల విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎంఇఒ-2 సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎంతకాలం పని చేశామని కాకుండా ఎంత మందికి సేవ చేశామనే విధంగా బాధ్యతలు నిర్వహిస్తే ప్రజలలో చిర స్థాయిగా నిలిచిపోతామని అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, యాగంటయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లవి, ఎంపిపి హుస్సేన్ బీ, ఎంపిడిఒ భాగ్యలక్ష్మి, ఏఈ.పుల్లయ్య, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సిలు శ్రీహరి, రాజశేఖర్, సిబ్బంది నాగరాజు, సుబాన్ తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న దృశ్యం

నేడు విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బనగానపల్లె

నేడు చేపట్టే దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధనుంజేయుడు, ప్రతాప్‌లు కోరారు. బుధవారం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఎ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని, తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాసాలతో, భాద్యతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారని విమర్శించారు. నీట్ పరీక్షా లీకేజీ తెరవెనుక కుంభకోణం, నీట్ పిజి పరీక్షను 12గంటల ముందు వాయిదా వేయడం, యూజిసి నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని తెలిపారు. నీట్ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్యా పరిస్థితి కూడా దారుణంగా తయారుచేశారని విమర్శించారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా నేడు దేశ వ్యాప్తంగా కెజి నుండి పిజి వరకూ విద్యాసంస్థల బంద్‌లో అన్ని విద్యా సంస్థలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రి స్వామి, నాయకులు కిరణ్ సాయి బాలు, కిరణ్, రఫీ, బన్నీ, హరి, బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం :** నేడు జరిగే విద్యాసంస్థల బందును జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి బత్తిని ప్రతాప్, మండల అధ్యక్షులు కార్తీక్, కార్యదర్శులు వేణు, రాజు, మధులు విద్యార్థులతో కలిసి బంద్ వాల్ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మండల విద్యాధికారి సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని విచ్చిన్నం చేస్తుందన్నారు. ఎన్‌టిఎ లాంటి సంస్థలను రద్దు చేయాలన్నారు. నీట్ పరీక్షను రాసి నష్టపోయిన విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, నీట్ పరీక్ష రద్దుపై నైతికంగా కేంద్ర కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులపై కేసులు సరైనది కాదన్నారు. పాఠశాలల మూసివేతలను ఆపాలని, పిహెచ్‌డి అడ్మిషన్ల కోసం నిర్వహిస్తున్న పరీక్షల్లో నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటసాయి, ఎం.మధు, కిషోర్ నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : మండలంలోని బ్రాహ్మణకొట్టుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై నాగార్జున తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నుంచి వస్తున్న ఒంగోలు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు బ్రాహ్మణకొట్కూరు భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బ్రాహ్మణకొట్టుకూరుకు చెందిన అసపోగు రవి (35) చెందాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి అన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్‌టి రాష్ట్ర మహిళా కమిటీ ఉపాధ్యక్షులుగా మనోరమ

ప్రజాశక్తి - ప్యాపిలి : పట్టణానికి చెందిన మనోరమ ఎస్‌టి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. ఉన్నత విద్యావంతురాలు మనోరమ ఎన్నిక కావడం పట్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేసారు. ఆమె మాట్లాడుతూ ఎరుకల జాతి అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

ఫిజియోథెరపీపై అవగాహన

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు హైదరాబాద్ నిజాం ఫీజియోథెరోపి డాక్టర్ రమేష్, సిబ్బందితో ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు టెన్షన్‌కు లోనుకాకుండా, శారీరక, మానసికంగా ఎలా ధృఢంగా ఉండాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మి, హెచ్ఎం సుబ్బారాయుడు, తిరుపతయ్య, రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - చాగలమర్రి : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ కార్య నిర్వహణ అధికారి ప్రకాశం హెచ్చరించారు . బుధవారం చాగలమర్రి పట్టణంలోని 1,5 వ సచివాలయాలను అకస్మికంగా తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. సచివాలయ పరిధిలో అందించే వివిధ సర్వీసులను గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

కౌలు దారు పత్రాలు కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - బేతంచర్ల : ఖరీఫ్ సీజన్‌లో కౌలుకు పొలం తీసుకొని సాగు చేస్తున్న రైతులు కౌలు పత్రాలు పొందడానికి వెంటనే రైతు సేవా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను, లేదా గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో కౌలు పత్రాల కోసం రైతుల దగ్గర నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఏవో మాట్లాడుతూ కౌలు పత్రాలు పొందడం ద్వారా బ్యాంక్‌లో పంట రుణాలు పొందవచ్చని, పంట నమోదు కౌలు దారుడి పేరుతో చేసుకోవచ్చని, పంటల భీమా, నష్టపరిహారం పొందవచ్చన్నారు. పండించిన పంటను మద్దతు ధరకు కౌలు దారుడి పేరుతో అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ బెన్నీ రాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ యశోద, భారతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం అభినందనీయం : బొజ్జ

ప్రజాశక్తి - నంద్యాల : రాష్ట్ర పునర్విభజన జరిగి పది సంవత్సరాలైనా అనేక అంశాలు అపరిష్కృతంగా ఉన్న నేపథ్యంలో వాటి పరిష్కార దిశగా చొరవ తీసుకున్న ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సానుకూలంగా స్పందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జాదశరథ రామిరెడ్డి అభినందనలు తెలిపారు. నంద్యాల సమితి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలోని కేసీ కెనాల్, ఎల్‌ఎల్సీ, అటు తెలంగాణలోని ఆర్డిఎస్ స్థిరీకరణ కోసం ఉమ్మడి రాష్ట్రంలోనే గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం త్వరితగతిన సాగడానికి తెలంగాణ నుండి సానుకూల నిర్ణయం పొందాలని కోరారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో పూడిక చేరికను నివారించి ప్రాజెక్టు జీవితం కాలం పెంచాలన్నారు. ఈ ప్రాజెక్టుపై ఆధారపడిన తెలంగాణ, రాయలసీమ ప్రాజెక్టుల సక్రమ నిర్వహణ అత్యంత అవసరమని, ఇరు తెలుగు రాష్ట్రాల భవిష్యత్తుకు సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని కోరారు. కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి శాశ్వత పరిష్కారాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు.

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కర్నూలు.

I.A. No. 829/2022 In O.S. No. 1247/2022

కంసారి సావిత్రమ్మ ... వాది/అర్జిదారు

-Vs-

వడ్ల నారాయణమ్మ వగైరా.

...ప్రతివాదులు/రెస్పాండెంట్లు

2,4 రెస్పాండెంట్లకు ఆర్డర్-39, రూల్ 1 మరియు 2 ప్రకారం నోటీసులు

2) వడ్ల రమేష్ ఆచారి, తండ్రి లేట్ వడ్ల పెద్దరామాచారి

4) వడ్ల వైదేహి తండ్రి లేట్ వడ్ల పెద్దరామాచారి, ఇద్దరు రేగడ గూడూరు గ్రామము, వెలుగోడు మండలం, నంద్యాల జిల్లా.

పై నెంబరు దావాలో వాది ప్లైంటు షెడ్యూలు దాఖల ఆస్థిలో 1/4 బాగం ఇప్పించమని బాగ పరిష్కారం కోరి సదరు ఆస్థిని తనకు స్వాదీనం చేయమని కోరుతు దావా దాఖలు చేస్తూ ఈ ఆస్థిని ఎవ్వరు అన్యాక్రాంతము చేయకుండా మరియు ఎవ్వరు ప్రవేశించకుండా యాడ్-ఇంట్రీమ్, ఇంజక్షన్, ఉత్తర్వు కోరి అర్జిదాఖలు చేసినారు. ఇందులో 2,4 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణ ఉన్న 11-07-2024 పగలు 10:30 గం॥లకు పై కోర్టులో హాజరు అయి తెలుపుకొన వలయును. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఎం.ఎల్. శ్రీనివాసరెడ్డి

వాదిపరం, అడ్వకేట్, కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S. No. 1247/2022

కంసారి సావిత్రమ్మ ... వాది

-Vs-

వడ్ల నారాయణమ్మ వగైరా ... ప్రతివాది

2,4 ప్రతివాదులకు దావా సమన్లు

2) వడ్ల రమేష్ ఆచారి, తండ్రి లేట్ వడ్ల పెద్దరామాచారి

4) వడ్ల వైదేహి తండ్రి లేట్ వడ్ల పెద్దరామాచారి, ఇద్దరు రేగడ గూడూరు గ్రామము, వెలుగోడు మండలం, నంద్యాల జిల్లా.

పై నెంబరు దావాలో వాది ప్లైంటు దాఖల షెడ్యూలు ఆస్థిలో 1/4 బాగం ఇప్పించమని బాగ పరిష్కారం కోరి సదరు ఆస్థిని తనకు స్వాదీనం చేయమని కోరుతు దావా దాఖలు చేసినది. ఇందులో 2,4 ప్రతివాదులు అయిన మీకు ఆక్షేపణఉన్న 11-07-2024 తేది పగలు 10:30 గం॥లకు పై కోర్టులో హాజరుఅయి తెలుపుకొవలయును లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

షెడ్యూలు :-

1) కర్నూలు జిల్లా ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, ఓర్వకల్లు మండలం, బ్రాహ్మణపల్లి గ్రామము సర్వే నెంబర్ 3.18 సెంట్లు, తూర్పు కాప ప్రభాకర్ భూమి, పడమర-మాదిగ సత్యరాజు భూమి, ఉత్తరం-కంపెనిభూమి, దక్షిణం - బోయలక్ష్మమ్మ, ఎరుకలి సుబ్బరాయుడు.

2) బ్రాహ్మణపల్లి గ్రామములోని పాత ఇంటి నెం. 1/22, కొత్త ఇంటి నెంబరు 4/181, తూర్పు-గుండానారాయణ శెట్టి ఇల్లు, పడమర - రస్తా, ఉత్తరం - కమ్మరి రామాచారి ఇల్లు, దక్షిణం - రస్తా మరియు ఖాలిస్థలం.

3) బ్రాహ్మణపల్లి గ్రామములో ఇల్లు పాత నెంబర్-1/23, ప్రస్తుతం నెంబరు-4/182, తూర్పు గుండా నారాయణశెట్టి ఇల్లు, పడమర-వీరాస్వామి ఇల్లు, ఉత్తరం-చంద్రయ్య ఇల్లు, దక్షిణం-రస్తా.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఎం.ఎల్. శ్రీనివాసరెడ్డి

వాదిపరం, అడ్వకేట్, కర్నూలు.

మహారాజ శ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.17/2023

ఆర్యె మహాలక్ష్మి
భర్త ఆర్యె సోలెమన్
వయస్సు 51 సం॥,
పూల సుబ్బమ్మ కాలనీ, అర్బన్ హాస్పిటల్,
జడ్జి గెస్ట్ హౌస్, మార్కాపురం టౌన్ & మండలం
ఒంగోలు జిల్లా. ...వాది

V/s

2) సాదే ఆదిలక్ష్మి భర్త
సిలాన్స్ @ దస్తగిరి
R/o గోస్పాడు గ్రామం మరియు మండలం,
నంద్యాల జిల్లా. ...ప్రతివాది

2వ ప్రతివాదికి దావా సమన్లు

వాది, ప్రతివాది అయిన మీపై డిక్లరేషన్ మరియు పెర్మినెంట్ ఇంజక్షన్ కోరి దావా దాఖలు చేసి ఉన్నందున సదరు దావాలో మీ యొక్క హాజరు నిమిత్తం 05.07.2024వ తేదీన ఉదయం 10:30 గ॥లకు పై కోర్టులో నీవు స్వయంగా గాని మీ వకీల్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల నీకు పరోక్షంగా దావా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తరువు మేరకు)

వాయిదా తేదీ: 05.07.2024

బి. శివప్రసాదరావు,
ఎస్. రమణయ్య,
వాదిపరం అడ్వకేట్స్,
ఆళ్లగడ్డ